క్లుప్తంగా

పేద కుటుంబాలకు అండగా ఉంటాం



నెహ్రూనగర్: పశ్చిమ నియోజకవర్గంలోని స్టాల్ గర్ల్స్ హైస్కూల్ ఎదురు రోడ్డు నుంచి దర్గా వరకు రోడ్డు విస్తీర్ణంలో భాగంగా రోడ్డుకి రెండు వైపులా ఉన్న పేద కుటుంబాలు వారు వ్యాపారం చేసుకునే పాత దుస్తుల షాపులను కోల్పోయిన వారికి అండగా ఉంటామని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం పేర్కొన్నారు. మంగళవారం బాధితులతో మాట్లాడి వారి భరోసా కల్పించారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ప్రత్యామ్నాయంగా మరొక చోట వ్యాపారం చేసుకునే విధంగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుకు చర్యలు



నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రధాన రహదారుల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామని జీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ) కోటేశ్వరరావు తెలిపారు. మంగళవారం గుజ్జనగుండ్ల, కొరిటెపాడు రోడ్డుల్లో స్పీడు బ్రేకర్లు ఏర్పాటుపై వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్యతో కలసి పరిశీలించారు. స్పీడు బ్రేకర్లు వేయడం ద్వారా బైకర్లు వేగం తగ్గించిన వారమవుతామని...త్వరితగతిన స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సీఐ ఈఈ దృష్టికి తీసుకువెళ్లారు.

రాజకీయాల్లో కీలక మలుపు మహారాష్ట్ర ఫలితాలు

లక్ష్మీపురం: జమిలి ఎన్నికలపై చర్చ నేపథ్యంలో మహారాష్ట్రలో 'మహయుతి' ఫ్రంట్ గెలుపు జాతీయ రాజకీయాల్లో కీలక మలుపు కానుందని సీనియర్ అధ్యాపకులు సి.సుబ్బారెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల ఫలితాలపై చర్చ గోష్టి నిర్వహించారు. విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య, అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో విద్యావేత్త ముప్పాళ్ల ప్రసాదరావు, ఇంజినీర్ సదాశివం ప్రసంగించారు.

ఔషధ సక్రమ వినియోగంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం



గుంటూరు ఎడ్యుకేషన్: వైద్యులు సూచించిన ఔషధాలను తగు మోతాదులో తీసుకునే విధంగా రోగులకు సూచనలు చేయాల్సిన బాధ్యతను ఫార్మసిస్టులు నిర్వర్తించాలని తెలుగు సాహితీ సమాఖ్య కార్యదర్శి ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో 63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా ఫార్మకాలజీ విభాగ ఆధ్వర్యంలో ''ఆరోగ్యం గురించి ఆలోచించండి-ఫార్మసీ, ఫార్మసిస్ట్ గురించి తెలుసుకోండి'' అనే అంశంపై గ్రూప్ డిస్కషన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఫార్మసిస్టులు రోగులకు సరఫరా చేసే ఔషధాల డోసు, నిల్వ చేసే విధానం, ఆహార నియమాలు, ఇతర దుష్ప్రభావాలు గురించి వివరించారు. గ్రూప్ డిస్కషన్‌లో బీ ఫార్మసీ, ఎం.ఫార్మసీ, ఫార్మా.డి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి. సీతారామయ్య, డాక్టర్ ఏ ప్రత్యూష, ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ దేసు బ్రహ్మ శ్రీనివాసరావు, డాక్టర్ పి.నాగరాజు పాల్గొన్నారు.

రేపు లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం



గుంటూరు రూరల్: నల్లపాడు వెంగళాయపాలెం రోడ్డులోని స్వయంభూ పుష్పాద్రి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సాయంత్రం 4 గంటలకు సహస్ర దీపాలంకరణ సేవ, 5 గంటలకు కోటి దీపోత్సవం, కార్తిక వన సమారాధన జరుగుతుందన్నారు.

కడుపునూ తొలుస్తున్న రాచపుండు

- ఆహారపు అలవాట్లతో పెరుగుతున్న కడుపు క్యాన్సర్లు
- యువతలోనూ బాధితులు
- అవగాహనతో వ్యాధిని కట్టడి చేయవచ్చు
- స్టమక్ క్యాన్సర్ అవగాహన మాసం ఇది

గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన రాము బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇటీవల కొద్దిరోజులుగా అనారోగ్యంతో చికిత్స కోసం సొంత ఊరు వచ్చి వైద్యులను సంప్రదించాడు. వైద్యులు పరీక్షలు చేసి స్టమక్ క్యాన్సర్ సోకినట్లు నిర్ధారించడంతో రాముకు, అతని కుటుంబ సభ్యులకు గుండె ఆగినంతపనైంది. ప్రాథమిక దశలోనే చికిత్స కోసం రావడం వల్ల సత్వరమే నయమయ్యేలా చేయవచ్చని భరోసా ఇవ్వడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఉద్యోగం దృష్ట్యా ఎక్కువ శాతం ఆహారం ఆన్‌లైన్‌లో తెప్పించుకుని తినడం, ఫాస్ట్‌ఫుడ్ తినడం, నాన్‌వెజ్ ఎక్కువగా తినడం వల్ల స్టమక్ క్యాన్సర్ సోకినట్లు వైద్యులు నిర్ధారించి చికిత్స అందించారు. నవంబరు నెలను స్టమక్ క్యాన్సర్ అవగాహన మాసంగా నిర్వహిస్తున్నారు.

క్యాన్సర్.. బీ కేర్ ఫుల్



లక్షణాలు...

గ్యాస్ట్రిక్ క్యాన్సర్‌గా పిలవబడే స్టమక్ క్యాన్సర్ సోకిన వారిలో మొదట్లో కడుపు చుట్టుపక్కల ప్రాంతంలో నొప్పి ఉంటుంది. చాలా మంది ఈ సమస్యను గ్యాస్ సమస్యగా భావించి సొంతంగా మందులు వేసుకోవడం ద్వారా విషమయంగా మారుతోంది. ఆకస్మాత్తుగా బరువు తగ్గిపోవడం, కడుపు నొప్పి, ఆకలి లేకపోవడం, ఆహారం తీసుకోవడంలో ఇబ్బంది, తరచు వాంతులు వంటి సమస్యలు వ్యాధి ప్రాథమిక దశలో కనిపిస్తాయి. ఏపనిచేయలేకపోవడం, నీరసంగా ఉండటం, గుండెల్లో మంట, కొంచం తింటే కడుపు నిండినట్లుగా ఉండటం. తిన్న ఆహారం జీర్ణం కాకపోవడం, వికారం, బొడ్డు చుట్టూ తీవ్రమైన నొప్పి వ్యాధి బాధితుల్లో కనిపిస్తాయి. భోజనం చేసిన అనంతరం తరచుగా వాంతులు అవడం, నలుపు రంగులో మలం రావడం, కాఫీ రంగులో వాంతులు అవడం కనిపిస్తాయి. కడుపులో పుండ్లు, కడుపులో మంట, అల్సర్ వంటి సమస్యలు కనిపిస్తాయి.

కారణాలు..

కడుపు క్యాన్సర్ ఎక్కువగా చెడు ఆహారపు అలవాట్లు, ఫాస్ట్‌ఫుడ్ ఎక్కువగా తినేవారిలో వస్తుంది. ధూమపానం, మద్యపానం, కొన్నిరకాల మందులు తీసుకోవడం ద్వారా వాటి వల్ల వచ్చే సైడ్‌ఎఫెక్ట్‌ల వలన గ్యాస్ట్రి క్యాన్సర్ సోకుతోంది. హెచ్‌పైలోరి బ్యాక్టీరియా ద్వారా వ్యాధి సోకుతోంది. ఆధునిక జీవన శైలి, వ్యాయామం లేకపోవడం, నిల్వ ఉన్న పచ్చళ్లు ఎక్కువగా తినడం వల్ల వస్తుంది. ఒకరికి జబ్బు ఉంటే, కుటుంబ సభ్యుల్లో ఇతరులకు సోకే అవకాశం ఉంది.

బాధితులు..

గుంటూరు జీజీహెచ్‌కు వారంలో ఇరువురు, లేదా ముగ్గురు గ్యాస్ట్రిక్ క్యాన్సర్ బాధితులు చికిత్స కోసం వస్తున్నట్లు వైద్య నిపుణులు తెలిపారు. జిల్లాలో పది మంది సర్జికల్ ఆంకాలజిస్టులు, 20 మంది మెడికల్ ఆంకాలజిస్టులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు వారంలో ఇరువురు చొప్పున బాధితులు చికిత్స కోసం వస్తున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు.

ముందస్తు జాగ్రత్తలు..



గ్యాస్ట్రిక్ క్యాన్సర్ సోకకుండా ప్రతి ఒక్కరూ మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలి. ఫాస్ట్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి. ప్రతిరోజూ తాజా ఆకుకూరలు, పండ్లు, భోజనంలో తీసుకోవాలి. ధూమపానం, మద్యపానం లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. నిల్వ ఉండే పచ్చళ్లు తినకూడదు. ఏదైనా గ్యాస్ట్రిక్ క్యాన్సర్ సమస్య కనిపిస్తే ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా తక్షణమే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ భైరపనేని స్రవంతి, క్యాన్సర్ వైద్య నిపుణులు, గుంటూరు

ఆధునిక చికిత్సలు



గ్యాస్ట్రిక్ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేయడం ద్వారా పూర్తిగా నివారించవచ్చు. ఇమ్యూనో థెరపి అనే ఆధునిక చికిత్స విధానం అందుబాటులో ఉంది. వైద్య రంగం రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో క్యాన్సర్‌లకు అత్యాధునిక ఆపరేషన్లు, మందులు, వైద్య పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి.

– డాక్టర్ ఎం.జి.నాగకిషోర్, సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్, గుంటూరు

ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం



మున్సిపల్ హైస్కూల్ విద్యార్థుల ర్యాలీ

గుంటూరు మెడికల్: ఆయుర్వేదంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ప్రభుత్వ ఆయుర్వేదిక్ డిస్పెన్సరీ జిల్లా సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.అనిత అన్నారు. దేశ్‌కా ప్రకృతి పరీక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ఎన్జీవో కాలనీ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు ఆయుర్వేద వైద్యంపై అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ అనిత మాట్లాడుతూ నవంబరు 26 నుంచి డిసెంబరు 25 వరకు ఆయుర్వేద వైద్యం ప్రాధాన్యంపై దేశ వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆయుర్వేద వైద్య విభాగాన్ని పటిష్టం చేసేందుకు అనేక చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. రోగి వివరాలు, ఆరోగ్య సూచనలు, శరీర తత్వానికి తగినట్లుగా వ్యక్తిగత చికిత్స వివరాలు, అన్ని కూడా నమోదు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మొబైల్ యాప్‌ను ప్రారంభించిందని చెప్పారు. ఈ యాప్‌లో పై వివరాలు పొందుపరుస్తామని, తద్వారా ప్రతి ఒక్కరికి ఆయుర్వేద వైద్యంపై అవగాహన కలుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయానందం, ఆయుర్వేద సిబ్బంది శ్రీవాణి పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన పెంచుకోవాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్

గుంటూరు ఎడ్యుకేషన్: దేశ, రాష్ట్ర భవిష్యత్తును నిర్ధారించే నేతలను ఎన్నుకునే హక్కును కోల్పోరాదని నగరపాలక సంస్థ కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఆర్వో పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం కేంద్ర ఎన్నికల సంఘ ఆదేశాల మేరకు సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో విద్యార్థినులకు ఓటు హక్కుపై అవగాహన స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘ మార్గదర్శకాల మేరకు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని చెప్పారు. ఓటు ద్వారా తమకు నచ్చిన, సమర్థ నాయకత్వాన్ని ఎన్నుకునే వీలు కలుగుతుందని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఓటు చాలా కీలకమని, భావి భారతాన్ని ఉన్నతంగా తీర్చి దిద్దుకోవడానికి 18ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించేందుకు ఎన్నికల సంఘం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులను బీఎల్‌ఓలతో పాటు ఆన్‌లైన్ ద్వారా దాఖలు చేయవచ్చునని వివరించారు. నూతన ఓటరు కార్డులను జనవరి 25 నాటికి అందిస్తామని తెలిపారు. అనంతరం 18 ఏళ్లు నిండిన విద్యార్థినులు ఓటర్లుగా నమోదవయ్యేందుకు దరఖాస్తులను తీసుకున్నారు. ఈసందర్భంగా తాము ఓటు హక్కును పొంది, ఎన్నికల్లో ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నామంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఆర్వో, డెప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్, స్వీప్ నోడల్ అధికారి దుర్గాబాయి, డీఈఓ కార్యాలయ ఏడీ నిర్మలారాణి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి పాల్గొన్నారు.

పన్ను బకాయిలపై దృష్టి సారించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



రెవెన్యూ అధికారులతో సమావేశమైన కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి, నీటి పన్ను బకాయిల వసూలుపై అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ చాంబర్‌లో డెప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లతో కలసి ఆస్తి, ఖాళీ స్థల పన్ను, నీటి మీటర్ల చార్జీల వసూళ్ల వేగవంతంపై బుధవారం సమావేశం నిర్వహించారు. తొలుత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల వారీగా పన్నుల వసూలుపై సమీక్షించి, లక్ష్యానికి తగిన విధంగా లేవని, రాబోవు రెండు రోజుల్లో వార్డు సచివాలయాల వారీగా అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పన్ను వసూలుకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని కోరారు. పెద్ద మొత్తంలో బకాయి ఉన్న అసెస్‌మెంట్ల నుంచి వసూలుకు రెవెన్యూ అధికారులు చొరవ చూపాలని సూచించారు. మొండి బకాయిదార్ల లిస్టులు సిద్ధం చేయాలని, వారి నుంచి వసూలు చేసే బాధ్యత డెప్యూటీ కమిషనర్లు తీసుకోవాలని, స్పందించని మొండి బకాయిదార్ల నివాసాలకు ట్యాప్, డ్రెయినేజీ కనెక్షన్ తొలగించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి పన్నుకూడా పెద్ద మొత్తంలో పెండింగ్ ఉందని, బకాయిల వసూలుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వేగవంతం చేయాలని ఆదేశించారు. వార్డు సచివాలయాల వారీగా ప్రతి అసెస్‌మెంట్ తనిఖీ చేసి, అండర్, అన్ అసెస్‌మెంట్లను గుర్తించి, తదుపరి సమావేశం నాటికి డిమాండ్‌లో పురోగతి ఉండాలన్నారు. రెవెన్యూ వసూలులో నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, అడ్మిన్ కార్యదర్శులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, రెవెన్యూ అధికారులు బాలాజీ బాషా, రెహ్మాన్, రవికిరణ్ రెడ్డి, సాదిక్ బాషా పాల్గొన్నారు.

చెత్త తరలింపు వాహనాల వివరాలు నమోదు..

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని పొన్నూరు రోడ్ ఎంఆర్‌ఎఫ్(మెటీరియల్ రికవరీ ఫెసిలిటి సెంటర్)ని సమర్థంగా నిర్వహించాలని, ప్రత్యేక రిజిస్టర్ ద్వారా చెత్త తరలింపు వాహనాల ట్రిప్‌ల వివరాలు నమోదు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ కొండయ్య కాలని, రాజీవ్ గాంధీ నగర్, శ్యామల నగర్ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను పరిశీలించి, అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. తొలుత ఎంఆర్‌ఎఫ్ సెంటర్‌ని పరిశీలించి, ప్రతి రోజు ఎన్ని వాహనాల ద్వారా చెత్త వస్తుంది, అక్కడి నుంచి జిందాల్‌కి ఎంత తరలిస్తుంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని వ్యర్థాలు అన్నీ ఈ-ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా పొన్నూరు రోడ్‌లోని ఎంఆర్‌ఎఫ్ సెంటర్‌కి వచ్చి, అక్కడి నుంచి పెద్ద కంపాక్టర్ల ద్వారా జిందాల్‌కి తరలించే ప్రక్రియ సమర్థంగా జరగాలన్నారు. సెంటర్‌లో వ్యర్థాలు నిల్వ ఉండకుండా కాంపాక్టర్లు అందుబాటులో ఉండేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. పర్యటనలో డీఈఈలు మధుసూదన్, నాగ భూషణం, శ్రీనివాస్, ఆర్వోలు రెహ్మాన్, రవి కిరణ్ రెడ్డి, ఏఈలు రవి కిరణ్, చైతన్య పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్



నిందితులతో గుంటూరు ఎక్సైజ్ సీఐ లత

నెహ్రూనగర్: తెలంగాణ మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు గుంటూరు- 1 టౌన్ ఎక్సైజ్ సీఐ బి.లత తెలిపారు. వివరాలు.. నల్లచెరువుకు చెందిన షేక్ ఇంతియాజ్ పొన్నూరు రోడ్డులోని కరెంట్ ఆఫీస్ వద్ద హీరో హోండా బైక్‌పై తెలంగాణ రాష్ట్రానికి చెందిన 13 మద్యం బాటిళ్ల అమ్ముతుండటంతో అతన్ని అరెస్టు చేశామన్నారు. అదే విధంగా లాల్‌పురానికి చెందిన దేవరశెట్టి శ్రీనివాసరావు చిలకలూరిపేట రోడ్డులోని సత్యసాయి ట్రస్ట్ ఎదురుగా ఉన్న నేషనల్ హైవే కింద అండర్ పాస్ వద్ద తెలంగాణ రాష్ట్రానికి చెందిన మద్యం బాటిళ్ల విక్రయాలు జరుపుతుండడంతో అరెస్టు చేసినట్లు వివరించారు. ఆమె వెంట ఎస్ఐలు పి.తిరుమలేశ్వరరావు, మొహమ్మద్ ఖాశీం షరీఫ్, సిబ్బంది బసవేశ్వరరావు, పూర్ణచంద్రరరావు, వీరాంజనేయులు, చిన్నగోపి, మస్తాన్‌వలి, శ్రీమన్నారాయణ, వీఆర్వోలు కృష్ణకాంత్, శివకోటిలింగేశ్వరరావు పాల్గొన్నారు.

పంచ భూతాలు పరమేశ్వర స్వరూపాలు



మాట్లాడుతున్న నాగరాజ్యలక్ష్మి

నగరంపాలెం: పంచ భూతాలైన భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకాశం పరమేశ్వరుని అంశాలని, ఆ అయిదింటిని గౌరవించాలని ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి అన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షులు విజయబాబు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పంచ భూతాలను రక్షించుకోవటం మనిషి కర్తవ్యమని అన్నారు. పంచ భూతాల వైభవాలను, అంతరిక్ష వైభవం, వేద, పురాణ, శాస్త్రీయలను వివరించారు. సభకు డాక్టర్ మాధవపెద్ది విజయలక్ష్మి అధ్యక్షత వహించి, అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. డాక్టర్ అంచే విజయలక్ష్మి ప్రాచీన ప్రసిద్ధ తెలుగు పద్యాల్లో కొన్ని ఆణిముత్యాల విశేషాలను వివరించారు.

దేవకీ నందన వాసుదేవ చిత్ర బృందం సందడి



మాట్లాడుతున్న నటుడు గల్లా అశోక్

నగరంపాలెం: దేవకీ నందన వాసుదేవ చిత్ర విజయాన్ని ప్రేక్షక దేవుళ్లకు అంకితం చేస్తున్నట్లు సినీ నటుడు గల్లా అశోక్ అన్నారు. దేవకీ నందన వాసుదేవ చిత్రం విజయోత్సవంలో భాగంగా బుధవారం సాయంత్రం హరిహర్‌మహల్ థియేటర్‌లో చిత్ర యూనిట్ సందడి చేసింది. అనంతరం మీడియాతో సినీ నటుడు అశోక్ మాట్లాడుతూ తాత సూపర్ స్టార్ కృష్ణ, మేనమావ సూపర్ స్టార్ మహేష్‌బాబుల స్ఫూర్తితో నటుడిగా సినీ రంగంలోకి వచ్చానని చెప్పారు. మంచి కథతో పాటు చిత్రాన్ని అద్భుతంగా మలచడంలో దర్శకుడు అర్జున్ జంధ్యాల విజయవంతమయ్యారని అన్నారు. తూర్పు ఎమ్మెల్యే షేక్ నజీర్‌అహ్మద్ మాట్లాడుతూ మంచి పాత్రలను ఎంచుకుని, సినీ రంగంలో తనకంటూ సుస్థిర స్థానం సంపాదించుకోవాలని అన్నారు. మరెన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించాలని ఆయన కోరారు. చిత్ర దర్శకుడు అర్జున్ జంధ్యాల, టీడీపీ నాయకులు ముత్తినేని రాజేష్, రావిపాటి సాయికృష్ణ, చిట్టాబత్తిని చిట్టిబాబు, అగ్రనటుడు మహేష్‌బాబు, హీరో గల్లా అశోక్ అభిమానులు సందడి చేశారు.

దేశ చరిత్రను మార్చే శక్తి ఒక్క ఓటుతోనే సాధ్యం

గుంటూరు రూరల్: దేశ చరిత్రను మార్చేశక్తి ఒక్క ఓటుతోనే సాధ్యమని జిల్లా స్పెషల్ డెప్యూటీ కలెక్టర్, రిటర్నింగ్ ఆఫీసర్ గంగరాజు తెలిపారు. బుధవారం నగర శివారుల్లోని లాంలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్(స్వీప్) కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. ఓటు హక్కు ప్రతి విద్యార్థిని, విద్యార్థులు తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. సమాజాన్ని మార్చే ఆయుధం ఒక్క ఓటేనని తెలిపారు. తాడికొండ మండల తహసీల్దారు, అసిస్టెంట్ ఎలక్షన్ రిటరినింగ్ అధికారి కె.నాసరయ్య మాట్లాడుతూ చలపతి కళాశాలలో గురువారం బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని 18 సంవత్సరాలు నిండిన ప్రతి విద్యార్థి బీఎల్‌ఓల దగ్గర ఆధార్ కార్డు సమర్పించి ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ హక్కులతో పాటు బాధ్యతలు నెరవేర్చాలని గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.చంద్రశేఖర్, డీటీ ఎ.మోహినికుమారి పాల్గొన్నారు.

స్వామి ప్రతిమ ధ్వంసం..

కేసు నమోదు చేసిన పట్టాభిపురం పోలీసులు

లక్ష్మీపురం: ఓ అపార్ట్‌మెంట్ కింది భాగంలోని పార్కింగ్ ప్రదేశంలో ఉన్న శ్రీ వేంటేశ్వర స్వామి ప్రతిమను కొందరు బుధవారం ధ్వంసం చేయడంపై అపార్ట్‌మెంట్ సెక్రటరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. బృందావన్ గార్డెన్స్ 3వ లైన్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో కింది భాగంలో గోడకు సిమెంట్‌తో శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఆ అపార్ట్‌మెంట్‌లో వ్యాపారులు, ఉద్యోగులు నివాసం ఉంటారు. అయితే విగ్రహంపై భాగంలో దేవరశెట్టి సుబ్బారావు కాటన్ వ్యాపారి, ఆనంద్ విద్యుత్ శాఖలో ప్రభుత్వ ఉద్యోగి, కాశీనాథ్ బాబు రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తు జీవనం సాగిస్తుంటారు. అయితే కొంత కాలంగా వారి వ్యాపారాల్లో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని సిద్ధాంతి వద్దకు వెళ్లి సంప్రదించారు. సిద్ధాంతి వెంకటేశ్వరస్వామి విగ్రహం పైన నివాసం ఉండటం సరి కాదని చెప్పాడు. దీంతో దేవరశెట్టి సుబ్బారావు, మిగిలిన ఇద్దరు అపార్ట్‌మెంట్ సెక్రటరీ నాతాని వెంకటేశ్వరరావుకు, కమిటీ సభ్యులు సుమారు 10 రోజులకు విగ్రహాన్ని తొలగించాల్సిందిగా కోరుతున్నారు. సెక్రటరీ వెంకటేశ్వరరావు కమిటీ సమావేశం ఏర్పాటు చేసి కమిటీ సభ్యుల దృష్టికి తీసుకు వెళ్లి విగ్రహాన్ని తొలిగిద్దాం అని చెప్పుకుంటూ వస్తున్నారు. ఈ క్రమంలో ఎంతకు అపార్ట్‌మెంట్ కమిటీ ప్రతిమను తొలిగించకపోవడంతో బుధవారం తెల్లవారు జామున డ్రిల్లింగ్ మిషన్‌ను తీసుకు వచ్చి ప్రతిమను ధ్వంసం చేయడం ప్రారంభించారు. దీన్ని గమనించిన అపార్ట్‌మెంట్ వాసులు తక్షణమే పోలీస్ డైల్ 112కు సమాచారం తెలియజేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రతిమ ధ్వంసం చేస్తున్న దేవరశెట్టి సుబ్బారావును అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ప్రతిమ ధ్వంసం చేసిన ఘటనలో అపార్ట్‌మెంట్ సెక్రటరీ వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవరశెట్టి సుబ్బారావు, ఆనంద్, కాశీనాథ్‌బాబులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే అపార్ట్‌మెంట్ కమిటీ సభ్యులు ధ్వంసం చేసిన శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని పూర్తిగా తొలిగించి నదిలో కలిపినట్లు సమాచారం.

మహిళల రక్షణకు చర్యలు తీసుకోవాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఐద్వా నాయకులు

లక్ష్మీపురం: మహిళలు, చిన్నారులకు రక్షణ లేని పరిస్థితి సమాజంలో ఏర్పడిందని ప్రతిక్షణం ఎక్కడో ఒకచోట లైంగిక దాడులు, హింస చోటుచేసుకుంటున్నాయని ఐద్వా నగర కార్యదర్శి ఎ.కళ్యాణి పేర్కొన్నారు. నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు హింస వ్యతిరేక వారోత్సవాల సందర్భంగా బుధవారం స్థానిక దేవాపురంలో అంజలి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భాగస్వాములు లేదా బంధువుల చేతుల్లో రోజుకు సగటున 140 మంది మహిళలు హత్య గావించబడుతున్నారని ఐక్యరాజ్యసమితి నివేదిక చెప్పిందన్నారు. పని ప్రదేశాలలో మహిళలు లైంగిక వేధింపులకు గురవుతున్నారని, రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని పేర్కొన్నారు. మహిళలకు రక్షణ కమిటీలు వేయించాలని అన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా సత్వరమే న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. ముఖ్యంగా మద్యం మత్తులో మాదకద్రవ్యాలు డ్రగ్స్ వల్ల ఇటువంటి దాడులు మహిళలపై ఎక్కువ అవుతున్నాయని చెప్పారు. అలాగే అశ్లీల వీడియోల వల్ల అటువంటి వెబ్‌సైట్ ల వల్ల యువత పై చెడు ప్రభావం పడుతుందని తెలిపారు. ప్రభుత్వం మద్యాన్ని నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలని మహిళలపై జరిగే హింసని అరికట్టాలని అన్నారు. కార్యక్రమంలో నాగలక్ష్మి, అనూరాధ, రత్న, సుజాత, కోటమ్మ, దానమ్మ జయమ్మ పాల్గొన్నారు.

జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు తెనాలి విద్యార్థులు

తెనాలి: బీహార్ రాష్ట్రంలోని గయ పట్టణంలో ఈనెల 29-31 తేదీల్లో జరగనున్న 43వ సబ్ జూనియర్ జాతీయ షూటింగ్ బాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొనే రాష్ట్ర జట్లకు స్థానిక కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ బాలుర జట్టులో 9వ తరగతి విద్యార్థి షేక్ హనీఫ్, బాలికల రాష్ట్ర జట్టులో 9వ తరగతి విద్యార్థిని పెనుమూడి బ్యూల ఎంపికయ్యారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని షేక్ మౌలాబి, వ్యాయామ ఉపాధ్యాయులు టి.ప్రసాద కుమారి, కొడాలి గోవర్ధన, ఎన్‌సీసీ అధికారి పరిశా సర్దార్‌లు విద్యార్థులను అభినందించారు.

బాల్య వివాహాలు సమాజ రుగ్మత

ప్రత్తిపాడు: బాల్య వివాహాల వలన మాతాశిశు మరణాలు సంభవించే ప్రమాదం ఉందని గుంటూరు ఐసీడీఎస్ పీడీ ఎం.ఉమాదేవి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం బాల్య వివాహాల రహిత ఆంధ్రప్రదేశ్‌పై ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. వార్డు సభ్యుడు డబ్బూరి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. పీడీ మాట్లాడుతూ బాల్య వివాహాలు సమాజరుగ్మత అని అన్నారు. దేశం వెనుక బడటానికి కారణం నిరక్షరాస్యత, బాల్య వివాహాలేనని చెప్పారు. బాల్య వివాహాలను నిరోధించడంలో తల్లిదండ్రులతో పాటు సామాజం యొక్క పాత్ర కూడా అనిర్వచనీయమైనదని తెలిపారు. ఇది ఒక్క ఐసీడీఎస్ బాధ్యతగా అనుకోవద్దని అనేక శాఖలు ప్రజలు గ్రామస్తులు అన్ని వర్గాల సహకారంతోనే సాధ్యపడుతుందని పేర్కొన్నారు. జిల్లాలో 524 బాల్య వివాహాలు జరిగాయని, మరికొన్నింటిని సమర్థంగా అందరి సమష్టి కృషితో అడ్డుకోగలిగామని వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు విధుల్లో నిబద్ధతతో పని చేస్తూ బాల్య వివాహాల నిరోధానికి ప్రాథమిక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 2030 నాటికి బాల్య వివాహాలు తగ్గుముఖం పట్టేలా మనమంతా అడుగులు ముందుకు వేయాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీడీపీఓ వి.సుజాతదేవి పాల్గొన్నారు.